| | | | | |
|---|---|---|---|---|
| భేకాలోక | 20 | కృతి | 129031 | భ/ మ/ మ/ త/ న/ స/ గగ |
| ఇంద్రవిమాన | 23 | వికృతి | 2089447 | భ/త/న/మ/భ/న/న/గగ |
| మత్తాక్రీడా | 23 | వికృతి | 4194049 | మ/ మ/ త/ న/ న/ న/ న/ లగ |
| అధీరకరీర | 24 | సంకృతి | 3653113 | మ/న/న/భ/స/న/జ/య |
| పార్షతసరణం | 24 | సంకృతి | 4190335 | భ/న/య/మ/న/న/న/య |
| క్రౌంచపదము | 24 | సంకృతి | 4193479 | భ/మ/స/భ/న/న/న/య |
| భాస్కరవిలసితము | 24 | సంకృతి | 8381311 | భ/న/జ/య/భ/న/న/స/గ |
| సరసిజము | 24 | సంకృతి | 8388193 | మ/త/య/న/న/న/న/స |
| అభ్రభ్రమణ | 25 | అభికృతి | 16774717 | త/న/మ/స/న/న/న/న/గ |
| క్రౌంచపద | 25 | అభికృతి | 16776391 | భ/ మ/ స/ భ/ న/ న/ న/ న/ గ |
| ఉజ్ఝితకదన | 26 | ఉత్కృతి | 16767871 | భ/న/జ/జ/జ/న/న/న/గగ |
| ఆపీడ | 26 | ఉత్కృతి | 33523711 | భ/న/న/స/మ/న/న/న/లగ |
| మణికిరణము | 29 | | | న/న/భ/న/జ/న/న/న/న/లగ |
| దర | 30 | | | న /న/న/న/న /న /న/న//భ/స |
| లహరికా | 31 | | | న /న/న/న/న /న /న/న/న/న /గ |

భేకాలోక - భ/మ/మ/త/న/స/గగ, ప్రాసయతి (1, 6), యతి (1, 10, 16)
UII UU - UU UU - UU IIII - IIU UU
20 కృతి 129031

రామునిఁ బిల్వన్ - బ్రేమన్ రామా-రామమ్ము మనసు - రమణీయమ్మో
కామునిఁ గొల్వన్ - బ్రేమన్ కామా-కారమ్ము కనుల - కగుపించున్గా
శ్యామునిఁ దల్వన్ - బ్రేమన్ సామా-స్వాదమ్ము చెవికి - స్వరయుక్తమ్మై
శ్రీమయు నీడన్ - బ్రేమల్ సీమా-సీమమ్ము హృదయ - శిఖర మ్మంటున్

కంద పద్యములుగా -

రామునిఁ బిల్వన్ బ్రేమన్
రామారామమ్ము మనసు - రమణీయమ్మో
కామునిఁ గొల్వన్ బ్రేమన్
కామాకారమ్ము కనుల - కగుపించున్గా.

శ్యామునిఁ దల్వన్ బ్రేమన్
సామాస్వాదమ్ము చెవికి - స్వరయుక్తమ్మై
శ్రీమయు నీడన్ బ్రేమల్
సీమాసీమమ్ము హృదయ - శిఖర మ్మంటున్

ఇంద్రవిమాన - భ/త/న/మ/భ/న/న/గగ, యతి (1, 6, 12, 18)

UII UU - IIII UU - UU IIII - IIII UU

23 వికృతి 2089447

సారసనేత్రా - సరసవిచారా - చల్లంగ వెలిఁగె - శశి యట మింటన్
మారశరీరా - మదనకుమారా - మాయ మ్మయితివి - మలఁగుచు నుంటిన్
కారణ మేమో - కనుల వికారా-కార మ్మగపడెఁ - గళలు నశించెన్
కోరితి నిన్నే - గుటిలునిఁ గ్రూరా - ఘోరమ్ము నలఁతఁ - గుములుచునుంటిన్.

కంద పద్యములుగా -

సారసనేత్రా సరసవి-
చారా చల్లంగ వెలిఁగె - శశి యట మింటన్
మారశరీరా మదనకు-
మారా మాయ మ్మయితివి - మలఁగుచు నుంటిన్.

కారణ మేమో కనుల వి-
కారాకార మ్మగపడెఁ - గళలు నశించెన్
కోరితి నిన్నే కుటిలునిఁ
గ్రూరాఘోరమ్ము నలఁతఁ - గుములుచునుంటిన్.

మత్తాక్రీడా/ హంసి - మ/మ/త/న/న/న/న/స/గ , ప్రాసయతి (1.1, 3.1), యతి (1.1, 5.1, 7.1)
UU UU - UU UU - IIII IIII - IIII UU
23 వికృతి 4194049
హరిగతి రగడ - ఎనిమిది చతుర్మాత్రలు, యతి (1.1, 5.1), ప్రాస, అంత్యప్రాస

రారా ప్రాణా-ధారా రారా - ప్రణయ కరములను - రమణికి నీరా
రారా చిత్రా-కారా రారా - ప్రణయపు ప్రథమ సు-రవముల నీరా
రారా శిష్టా-చారా రారా - ప్రణయపు రథమున - రవివలె రారా
రారా మోదాఽ-సారా రారా - ప్రణయ సరసముల - రసికుఁడవేరా.

కంద పద్యములుగా -

రారా ప్రాణాధారా
రారా ప్రణయ కరములను - రమణికి నీరా
రారా చిత్రాకారా
రారా ప్రణయపు ప్రథమ - సురవములఁ దేరా.

రారా శిష్టాచారా
రారా ప్రణయపు రథమున - రవివలె రారా
రారా మోదాఽసారా
రారా ప్రణయ సరసముల - రసికుఁడవేరా.

విద్యున్మాల - మ/మ/గగ, యతి పాటించబడలేదు:
8 అనుష్టుప్ 1

రారా ప్రాణాధారా రారా
రారా చిత్రాకారా రారా
రారా శిష్టాచారా రారా
రారా మోదాఽసారా రారా.

కమలవిలసితము  - న/న/న/న/గగ, యతి (1,9)

14 శక్వరి 4096

మధురగతి రగడ - నాలుగు చతుర్మాత్రలు, యతి (1.1, 3.1), ప్రాస, అంత్యప్రాస

ప్రణయ కరములను - రమణికి నీరా

ప్రణయపు ప్రథమ సు-రవముల నీరా

ప్రణయపు రథమున - రవివలె రారా

ప్రణయ సరసముల - రసికుఁడవేరా.

అధీరకరీర - మ/న/న/భ/స/న/జ/య, యతి (1, 6, 13, 20)

UU UII - IIII UII - IIU IIII - UII UU

24 సంకృతి 3653113

శృంగారమ్ముల - సిరులని చెంగునఁ - జెరలాడ హృదియు - శృంగముఁ దాకెన్
పొంగట్టున్ గన - ముదమునఁ బొంగెను - బొరలాడె నెదయు - పున్నమి రేయిన్
రంగుల్ రాజిల - రమణము రంగము - రస మొల్కు పలుకు - రతనము లెందున్
రంగా రమ్మర - రయముగ రంగుల - రచనమ్ము నిపుడు - రమణికిఁ జూపన్.

కంద పద్యములుగా -

శృంగారమ్ముల సిరులని
చెంగునఁ జెరలాడ హృదియు - శృంగముఁ దాకెన్
పొంగట్టున్ గన ముదమునఁ
బొంగెను బొరలాడె నెదయు - పున్నమి రేయిన్.

రంగుల్ రాజిల రమణము
రంగము రస మొల్కు పలుకు - రతనము లెందున్
రంగా రమ్మర రయముగ
రంగుల రచనమ్ము నిపుడు - రమణికిఁ జూపన్.

పార్షతసరణం - భ/న/య/మ/న/న/న/య, ప్రాసయతి (1, 8), యతి (1, 12, 19)

UII IIII - UU UU - UII IIII - IIII UU

24 సంకృతి 4190335

భావము గలిఁగెను - భావాఽభావా - భవ్యముగ బ్రదుకు - వఱలును గాదా

జీవము వెలిఁగెను - జీవాఽజీవా - చింతనము లెపుడుఁ - జెలఁగును నీదై

రావము లలరె సు-రావా రావా - రమ్యముగ వినఁగ - రసములు జిల్కన్

జీవితమున నొక - శ్రీవై చేవన్ - శీఘ్రముగ నొసఁగఁ - జెలువముతో రా.

కంద పద్యములుగా -

భావము గలిఁగెను భావాఽ

భావా భవ్యముగ బ్రదుకు - వఱలును గాదా

జీవము వెలిఁగెను జీవాఽ

జీవా చింతనము లెపుడుఁ - జెలఁగును నీదై.

రావము లలరె సురావా

రావా రమ్యముగ వినఁగ - రసములు జిల్కన్

జీవితమున నొక శ్రీవై

చేవన్ శీఘ్రముగ నొసఁగఁ - జెలువముతో రా.

తెలుఁగు  క్రౌంచపదము - భ/మ/స/భ/న/న/న/య , ప్రాసయతి (1, 6), యతి (1, 11, 19)

UII UU - UII UU - IIII IIII - IIII UU
24 సంకృతి 4193479

దైవమ నీకే - పూవుల తావుల్ - తరువుల మెరిసెడు - తలిరులు నీకే

భావము నీకే - భావపు ప్రావల్ - పదముల ముదములు - పనసలు నీకే

జీవము నీకే - జీవపు చేవల్ - చిదమల హృదయపు - శివములు నీకే

శ్రీ వరదా నన్ - గావుమ సేవిం-చెద నిను గణపతి - చెలువుగ రావా.

కంద పద్యములుగా -

దైవమ నీకే పూవుల

తావుల్,  తరువుల మెరిసెడు  - తలిరులు నీకే

భావము నీకే భావపు

ప్రావల్, పదముల ముదములు - పనసలు నీకే.

జీవము నీకే జీవపు

చేవల్, చిదమల హృదయపు - శివములు నీకే

శ్రీ వరదా నన్ గావుమ

సేవించెద నిను గణపతి - చెలువుగ రావా.

భాస్కరవిలసితము - భ/న/జ/య/భ/న/న/స/గ, ప్రాసయతి (1, 8), యతి (1, 13, 20)

UII IIII - UII UU - UII IIII - IIII UU

24 అభికృతి 8381311

పావనినుత గురు - పావన భావా - భాస్కరవిలసిత - వరతనుభూషా
చేవల నొసఁగెడు - శ్రీవర జీవా - చిత్తము పిలిచెను - శ్రియ మృదుభాషా
దీవెన లిడు నగి - దేవర దేవా - దివ్వెల వెలుఁగుల - దినమును రావా
కావర మడఁచుచు - నీవిలఁ గావన్ - గౌముదివలెఁ బ్రియ - కరముల నీవా.

కంద పద్యములుగా -

పావనినుత గురు పావన
భావా, భాస్కరవిలసిత - వరతనుభూషా
చేవల నొసఁగెడు - శ్రీవర జీవా -
జీవా, చిత్తము పిలిచెను - శ్రియ మృదుభాషా.

దీవెన లిడు నగి దేవర
దేవా, దివ్వెల వెలుఁగుల - దినమును రావా
కావర మడఁచుచు నీవిలఁ
గావన్, గౌముదివలెఁ బ్రియ - కరముల నీవా.

సరసిజము - మ/త/య/న/న/న/న/స, ప్రాసయతి (1, 5), యతి (1, 10, 18)

UU UU UII UU IIII IIII IIII IIU

24 సంకృతి 8388193

లాలించేరే - పూల కరాలన్ - రమణులు శిశువును - లలిత పదములన్
కాళిందిన్ దు-ష్కాళియుఁ గాలన్ - గదుమగ వెఱపునఁ - గలగిరి కనులన్
కేశాకూళిన్ -మాలలఁ, గేళిన్ - గిరిధరు గళమున - గెలవున నిడిరే
స్త్రీలా చిద్గో-పాలుఁడు చేలన్ - జిలిపిగఁ గొన వడి - చిడిముడి వడిరే.

కంద పద్యములుగా -

లాలించేరే పూల క-
రాలన్ రమణులు శిశువును - లలిత పదములన్
కాళిందిన్ దుష్కాళియుఁ
గాలన్ గదుమగ వెఱపునఁ - గలగిరి కనులన్.

కేశాకూళిన్ మాలలఁ,
గేళిన్ గిరిధరు గళమున - గెలవున నిడిరే
స్త్రీలా చిద్గోపాలుఁడు
చేలన్ జిలిపిగఁ గొన వడి - చిడిముడి వడిరే.

అభ్రభ్రమణ - త/న/మ/స/న/న/న/న/గ , ప్రాసయతి (1, 7), యతి (1, 12, 19)

UU IIII - UU UII - UII IIII - IIII IIU

25 అభికృతి 16774717

మారా విజయకు-మారా మారుతి - మన్ననలఁ గొనిన - మమతల తరువా
శూరా వలువల - చోరా సూరుని - సొంపులను గడచు - సొబగుల కిరవా
హారీ యరిజన - హారీ హారము - లందుకొని ద్వరగ - హరుసము నియరా
వీరా ముదముల - వేరా భీరువు - భీతి కొక దివియ - వెలుఁగు నొసఁగరా.

కంద పద్యములుగా -

మారా విజయకుమారా
మారుతి మన్ననలఁ గొనిన - మమతల తరువా
శూరా వలువల చోరా
సూరుని సొంపులను గడచు - సొబగుల కిరవా.

హారీ యరిజన హారీ
హారము లందుకొని ద్వరగ - హరుసము నియరా
వీరా ముదముల వేరా
భీరువు భీతి కొక దివియ - వెలుఁగు నొసఁగరా.

సంస్కృత క్రౌంచపదము - భ/మ/స/భ/న/న/న/న/గ , ప్రాసయతి (1, 6), యతి (1, 11, 19)

UII UU - UII UU - IIII IIII - IIII IIU

25 అభికృతి 16776391

దైవమ నీకే - పూవుల తావుల్ - తరువుల మెరిసెడు - తలిరులు గొనరా

భావము నీకే - భావపు ప్రావల్ - పదముల ముదములు - పనసలు వినరా

జీవము నీకే - జీవపు చేవల్ - చిదమల హృదయపు - శివముల దొరవై

శ్రీ వరదా నన్ - గావుమ సేవిం-చెద నిను గణపతి - చెలువుల కిరవై.

కంద పద్యములుగా -

దైవమ నీకే పూవుల
తావుల్, తరువుల మెరిసెడు - తలిరులు గొనరా
భావము నీకే భావపు
ప్రావల్, పదముల ముదములు - పనసలు వినరా.

జీవము నీకే జీవపు
చేవల్, చిదమల హృదయపు - శివముల దొరవై
శ్రీ వరదా నన్ గావుమ
సేవించెద నిను గణపతి - చెలువుల కిరవై.

ఉజ్ఝితకదన – భ/న/జ/జ/జ/న/న/న/గగ, ప్రాసయతి (1, 8), యతి (1, 14, 21)

UII IIII - UII UII - UII IIII - IIII UU

26 ఉత్కృతి 16767871

తీరని కల లిఁకఁ - దీరునొ దేరులఁ - దేలుచు నడతునొ - దెలియదు కాదా
తారల వెలుఁగులఁ - దారలు ధారుణి - దారములొ యనఁగఁ - దళతళ లాడెన్
శారద రజనుల - స్ఫార తుషారపు - సాంద్రతల వెలిఁగె - శశి యల నింగిన్
జేరిక సమయము - చేరువఁ జేరుము - చిమ్ముఁగను సొబగు - సిరులఁ బ్రియాంగీ.

కంద పద్యములుగా -

తీరని **కల** లిఁకఁ - దీరునొ
దేరులఁ దేలుచు నడతునొ - దెలియదు కాదా
తారల వెలుఁగులఁ దారలు
ధారుణి దారములొ యనఁగఁ - దళతళ లాడెన్

శారద రజనుల స్ఫార తు-
షారపు సాంద్రతల వెలిఁగె - శశి యల నింగిన్
జేరిక సమయము చేరువఁ
జేరుము చిమ్ముఁగను సొబగు - సిరులఁ బ్రియాంగీ.

ఆపీడ – భ/న/న/స/మ/న/న/న/లగ, యతి (1, 14)

26 ఉత్కృతి 33523711

హరిగతి రగడ - ఎనిమిది చతుర్మాత్రలు, యతి (1.1, 5.1), ప్రాస, అంత్యప్రాస

కావలె ననె నిట హృదయము, రావా, - కన్నెన్ గన౽గను రసమయ హృదయా
త్రోవను గనుచును నిలిచితి, నీవే - తోడై సరసను నిలువుమ సదయా
యౌవన మది యొక విరివని, తావుల్ - హార్దమ్మగు, మది తనరును జెరలున్
నావృత మగు పలు తలపులు నీవే, - యాపీడ మవగ నిఖిలము వఱలున్.

కంద పద్యములుగా -

కావలె ననె నిట హృదయము,
రావా, కన్నెన్ గన౽గను - రసమయ హృదయా
త్రోవను గనుచును నిలిచితి,
నీవే తోడై సరసను - నిలువుమ సదయా.

యౌవన మది యొక విరివని,
తావుల్ హార్దమ్మగు, మది - తనరును జెరలున్
నావృత మగు పలు తలపులు
నీవే, యాపీడ మవగ - నిఖిలము వఱలున్.

మణికిరణము- న/న/భ/న/జ/న/న/న/న/లగ, ప్రాసయతి (1, 7), యతి (1, 15, 23)
IIII IIU - IIII IIU - IIII IIII - IIII IIU

పదముల చెలి స-త్పదముల వదలన్ - బ్రణవముఁ బలుకుచు - భరముగఁ గొలుతున్
సదమల మతితో - ముదముగ సదయన్ - జదువుల కొఱకయి - సదసునఁ బిలుతున్
నిదుర మెలకువన్ - జెదరని నిధికై - నిజముగ నడిగెద - నియత సువదనన్
మృదు పదములు నా - పెదవుల మెదలన్ - మెలయుచుఁ బొగడెద - మినుకుల పడఁతిన్

కంద పద్యములుగా -

పదముల చెలి సత్పదముల
వదలన్ బ్రణవముఁ బలుకుచు - భరముగఁ గొలుతున్
సదమల మతితో ముదముగ
సదయన్ జదువుల కొఱకయి - సదసునఁ బిలుతున్.

నిదుర మెలకువన్ జెదరని
నిధికై నిజముగ నడిగెద - నియత సువదనన్
మృదు పదములు నాపెదవుల
మెదలన్ మెలయుచుఁ బొగడెద - మినుకుల పడఁతిన్.

దర - న/న/న/న/న/న/న/న/భ/స , ప్రాసయతి (1, 9), యతి (1, 17, 25)
IIII IIII - IIII IIII - IIII IIII - UII IIU

మనసిట మురిసెను - మనువును మననము - మఱువకను సలుప - మౌనముగను నేన్
తనువిట విరిసెను - మనువును దనియుచుఁ - దలువగను విడక - దప్పక దినమున్
కనులిట నెరిసెను - మనువును గనఁగనఁ - గనఁగ నిముసమునఁ - గౌతుక మలరన్
వినగను దరిసెను - మనువును బెనుపడు - ప్రియ మధుర రవపు - వెల్లువ యలలన్.

కందములుగా -

మనసిట మురిసెను మనువును
మననము మఱువకను సలుప - మౌనముగను నేన్
తనువిట విరిసెను మనువును
దనియుచుఁ దలువగను విడక - దప్పక దినమున్.

కనులిట నెరిసెను మనువును
గనఁగనఁ గనఁగ నిముసమునఁ - గౌతుక మలరన్
వినగను దరిసెను మనువును
బెనుపడు ప్రియ మధుర రవపు - వెల్లువ యలలన్.

లహరికా - న/న/న/న/న/న/న/న/న/న/న/న/గ, ప్రాసయతి (1, 9), యతి (1, 17, 25)

IIII IIII - IIII IIII - IIII IIII - IIII IIU

మనసిజ జనకునిఁ - గనుఁగొన మనసున - మథనపడి యిచట - మనితిని గద నేన్

విన఼బడ దతనికి - మనసున వినతులు - విచలిత మవదుగ - వెత యది మదిలో

చనదుగ నితవులు - కనదుగ చనుపలు - సకియ నను మఱచె - సరసుఁడు నిజమై

మనికికి కతము ల-వనిపయి మనికిత - మయె ననఘుఁ డతఁడు - మఱి నను గనునో.

(నిడుద) కంద పద్యములుగా -

మనసిజ జనకునిఁ గనుఁగొన

మనసున మథనపడి యిచట - మనితిని గద నేన్

విన఼బడ దతనికి మనసున

వినతులు విచలిత మవదుగ - వెత యది మదిలో.

చనదుగ నితవులు కనదుగ

చనుపలు సకియ నను మఱచె - సరసుఁడు నిజమై

మనికికి కతము లవనిపయి

మనికిత మయె ననఘుఁ డతఁడు - మఱి నను గనునో.